# వసూల్ రాణి

**వాణిశ్రీ**




**బ్యాం**క్ డైరెక్టర్ల బోర్డ్ మీటింగ్‌కి వెళ్లొచ్చిన బ్రాంచి మేనేజర్ జయపాల్ ముఖం ధుమ ధుమలాడుతోంది. అసహనంతో వెళ్లి సీట్లో కూర్చున్నాడు. ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌తో మీటింగ్ పెట్టాడు.

"బోర్డు మీటింగ్‌లో మీ వల్ల నేను తిట్లు తినాల్సివచ్చింది. అప్పులు ఇప్పించేటప్పుడున్న శ్రద్ధ వసూలు చేయడంలో లేదు మీకు" అని అందరి మీదా ఫైరయ్యాడు మేనేజర్.

"నిజమే సార్! అప్పులు తీసుకునేవాళ్లు ఇచ్చే వరకూ కాళ్లా వేళ్లా పడతారు. ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టాల్సివచ్చేసరికి రేపు, మాపు అని తిప్పుతారు. మేమూ ఖాళీగా లేము సార్! వాళ్ల చుట్టూ తిరుగుతూనే వున్నాం".

"గట్టిగా అడిగితే ఇంటికొచ్చి దౌర్జన్యం చేశామనీ, హెరాస్ చేస్తున్నామనీ అభాండాలు వేస్తున్నారు సార్!"

"మీకు తెలుసుగా సార్! ఆ మధ్య రికవరీకి వెళ్లిన వాళ్లు దౌర్జన్యం చేశారని ఒకడు ఆత్మ హత్య చేసుకున్నాడు. పెద్దగొడవైంది. డబ్బు వసూలు కాకపోగా నష్టపరిహారం ఇచ్చుకోవాల్సి వచ్చింది."

ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ తలా ఒకరకంగా సంజాయిషీ ఇచ్చుకున్నారు.

"మిష్టర్ కిరణ్! నువ్వు రికమండ్ చేసి అప్పులు ఇప్పించిన వాళ్లే మరీ మొండిగా వున్నారయ్యా! ఆర్నెల్ల నుంచి ఒక్క రూపాయి కూడా జమ లేదు. నువ్వేం చేస్తావో నాకు తెలీదు. నెలనెలా వసూలు చేయాలి. కావాలంటే నువ్వొక అసిస్టెంట్‌ని ఏర్పాటు చేసుకో. ఆ పోస్టుకి శాలరీ ఏర్పాటు చేస్తాను." అని కిరణ్‌కి వార్నింగ్ ఇచ్చాడు మేనేజర్.

కిరణ్‌కుమార్ తలవూపాడు. కానీ తను ఎవర్ని అసిస్టెంట్‌గా తీసుకోవాలో అర్థం కాలేదు. రౌడీల్ని, గుండాల్ని తీసుకెళ్తే లేనిపోని తలనొప్పులు. వాళ్లు అలవాటు కొద్దీ ఓవర్ యాక్షన్ చేస్తారు. చూసేవాళ్లు కూడా గూండాల్ని పంపించారని తప్పు పడతారు. ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కిపోయింది.

'ఛ... ఛ... కమీషన్లకి ఆశపడి ఎవరికి బడితే వాళ్లకి అప్పులు ఇప్పించి తిప్పలు పడ గూడదు' అనుకున్నాడు.

*　　*　　*

"ఆగవే ఆగు."

దుర్గమ్మ గావు కేకవిని రోడ్డు మీద నడుస్తున్న వాళ్లంతా హడిలిపోయి ఎక్కడి వాళ్లక్కడ నిలబడిపోయారు.

కిరణ్‌కుమార్ కూడా స్కూటర్ స్టాండ్ వేసి నిలబడిపోయాడు.

సన్నగా పొడుగ్గా వున్న పాతికేళ్ల సుజాత వడివడిగా అడుగులు వేసుకుంటూ పారిపోతున్నదానిలా పోతోంది. ఆమెకు పదిగజాల దూరంలో హిడింబి చెల్లెల్లా, తాటకి కూతుర్లా పొట్టిగా లావుగా వున్న దుర్గమ్మ కేకలేస్తూ తరుముతోంది.

"సుజ్జీ ఆగవే. నిన్ను బజ్జీ చేస్తానే."

తప్పని పరిస్థితిలో రోడ్డు పక్కన ఆగిన సుజాత.

"దుర్గమ్మక్కా నీకు దండం పెడతా! కేకలెయ్యకు." అన్నది సిగ్గుతో చితికిపోతూ.

"దండాలు, దస్కాలూ నాకెందుకే? డబ్బులు కావాలిగానీ..." అంటూ రయ్‌న వచ్చింది దుర్గమ్మ.

"డబ్బులు రాగానే ఇస్తానక్కా!" బ్రతిమాలింది సుజాత.

"ఎప్పుడే వచ్చేది? మూణ్ణెల్ల నుండీ ఇదే పాట పాడుతున్నావ్! రాగానే ఇస్తా! రాగానే ఇస్తా అని. ఎప్పుడే నువ్విచ్చేది? నేను తీసుకునేది?" దుర్గమ్మ గొంతు కంచులా మోగుతోంది.

సుజాత తుఫాన్‌లో చిక్కుకున్న మొక్కలా భయంతో వణికిపోతోంది.

"చూడండయ్యా! దీని బడాయి? మూణ్ణెల్లయింది కొట్లో సరుకులు తీసుకుని. పైసా చెల్లియ్యలేదు. దీని మొగుడు... ఆఁ ఎవడే వాడు? వాడి పేరేంది?... ఆఁ... ఎంకటేశం గాడు. కనిపిస్తే ఒట్టు. ఈళ్ల యవ్వారం జూస్తంటే డబ్బిచ్చే బాపతులా లేదు. ఏ అర్ధరాత్రో గుడారం లేపేసి పోయే బాపతులా వుంది. ఏమే చెప్పు? డబ్బులు ఎప్పుడిస్తావ్?"

అక్కడ మూగిన జనాల మధ్య సుజాత పరువుతీసి వుతికి బజార్లో ఆరేస్తోంది దుర్గమ్మ.

సుజాతకు రోషం ముంచుకొచ్చి "ఇస్తాంలేవమ్మా! పారిపోతామా?" అన్నది.

సుజాత తనకు ఎదురు తిరగడం చూసి దుర్గమ్మకు మండుకొచ్చింది. పిచ్చికంత లేదు... నాకే ఎదురుతిరుగుతావా అనుకుని రెచ్చిపోయింది.

"అంత రోషం వున్నదానివైతే, ఒకమ్మా అబ్బకి పుట్టినదానివైతే నా డబ్బు కక్కవే."

"దుర్గమ్మా! ఏంటా మాటలు చండాలంగా?" అన్నది సుజాత వస్తున్న ఏడుపు ఆపుకుంటూ.

"ఏందే నా మాటలు చండాలంగా వున్నాయా? నేను చండాలపుదాన్నా? ఏం కూశావే నా సవితీ-!" అని దుర్గమ్మ బూతుల పంచాంగం మొదలుపెట్టింది.

దుర్గమ్మ బండ బూతులు వినలేక రోడ్డుమీద ఆగి తమాషా చూస్తున్న జనం 'హరిహరీ' 'శివ శివా' అని చెవులు మూసుకుంటూ ఎటువాళ్లటు పరారైపోయారు.

ఆ బజార్లో కొందరు పెద్దమనుషులు దుర్గమ్మని శాంతింపజేసి, సుజాతను కాపాడారు. దుర్గమ్మ చేతిలో సుజాత చావుదెబ్బలు తినకుండా రక్షించడంతో ఆమె ఏడ్చుకుంటూ వడివడిగా వెళ్లిపోతుంటే కూడా దుర్గమ్మ వదల్లేదు. ఆమె ఏడేడు తరాల వాళ్లని తిట్టిపోస్తోంది.

సుజాత కనిపించినంతసేపు తిట్టి తిట్టి అలసిపోయిన దుర్గమ్మ చెమటలు కక్కుకుంటూ, ఆయాస పడుతూ, తన భారీకాయాన్ని ఈడ్చుకుంటూ వెళ్లి తన కిరాణా కొట్టుముందు నిల్చుంది.

అప్పటివరకు కొట్లో కూర్చున్న బక్క శాల్తీ చటుక్కున లేచి నిలబడి "ఇక చాల్లే రావే!" అని సీటు ఖాళీ చేశాడు. దుర్గమ కొట్లో కూలబడింది.

ఆ బక్క జీవి దుర్గమ్మ మొగుడేనని కిరణ్ కుమార్‌కి అర్థమైంది.

"ఆ వెంకటేశంగాడికి ఖాతా ఎందుకు పెట్టావని" మొగుడి మీద విరుచుకుపడింది.

"ఇస్తాడ్లేవే? ఎక్కడికి పోతాడు? ఏవో ఇబ్బందులుంటాయి పాపం. నేను వసూలు చేస్తాగా! నువ్వు మరీ రెచ్చిపోకు. వాళ్లు పోలీస్ కంప్లైంట్ ఇస్తే లేనిపోని గొడవ" అంటూ దుర్గమ్మ మొగుడు సిగరెట్టొకటి ముట్టించుకుని అక్కడ్నుంచి జారుకున్నాడు.

"ఏందీ? పోలీసులకి చెప్తుద్దా? చెప్పుతో కొడతా నా సవితిని. పోలీసులొచ్చి ఏం పీకుతారంట?" అని తిట్ల దండకం మళ్లీ మెదలు పెట్టింది.

కిరణ్‌కుమార్ నెమ్మదిగా దుర్గమ్మ కొట్టు దగ్గరికి వెళ్లాడు.

"ఏం కావాలి సార్?" దుర్గమ్మ నవ్వుతూ అడిగింది. అప్పటి వరకూ తుమ్మల్లో పొద్దు గుంకినట్లు ధుమధుమలాడుతున్న ఆమె ముఖం ప్రసన్నంగా మారిపోయింది. దుర్గమ్మ నటనా చాతురణ గమనించిన కిరణ్‌కి పాత సినిమాలలో సూర్యకాంతం గుర్తొచ్చింది.

"నేను బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ని"

ఆ మాటవినగానే దుర్గమ్మ ముఖం మతాబాలా వెలిగింది. అప్పుడెప్పుడో తను లోన్ కోసం దరఖాస్తుపెట్టుకోవడం, బ్యాంక్‌చుట్టూ తిరిగడం, వాళ్లేమో మా వాళ్లొచ్చి నీ కొట్టు అదీ చూసి లోన్ శాంక్షన్ చేయిస్తారని చెప్పడం గర్తొచ్చాయి.

"రండి సార్!... రండి." అన్నది.

"ఒరేయ్ అప్పిగా!... అప్పిగా!" అని కేకలు పెట్టింది.

పదిహేనేళ్ల అప్పిగాడు వచ్చి నిల్చున్నాడు.

"సార్‌కి కుర్చీ ఎయ్యరా!" అన్నది దుర్గమ్మ.

కిరణ్‌కుమార్ కూర్చున్నాడు.

"అప్పిగా! సార్‌కి ఫ్రిజ్జులో మజా సీసా తీసియ్యరా!" అన్నది.

కిరణ్ మజా సిప్‌చేస్తూ "మీ పేరు దుర్గమ్మే నా?" అని అడిగాడు.

"నా పేరు దుర్గమ్మండీ! మా ఆయన పేరు గురవయ్యండి. అప్పిగాడు నా కొడుకండి." అన్నది.

"మీ షాపు రోజుకెంత బిజినెస్ చేస్తుందేం?"

"ఎంతోనాండి? వెయ్యి అమ్మితే గొప్పండి."

"రోజుకి వెయ్యి అంటే నెలకి ముప్ఫైవేలు. సుమారుగా మూడు వేలు మిగుల్తాయన్న మాట."

"నా బొంద మిగుల్తాయండి. మా ఆయన అడ్డమైనోళ్లకి ఖాతాలు పెట్టేస్తాడండి. ఆళ్లేమో ఇచ్చి సావరు. నేనెల్లి వసూలు చేసి సావాలి." అన్నది.

"మరి లోన్ కావాలని పెట్టారుగా? బాకీ ఎట్లా తీరుద్దామని? మూడు వేలొస్తే మీరు తింటానికే చాలదుగా?" అని అడిగాడు కిరణ్.

"అందుకేనండి. పాల బూతు పెట్టాలను కుంటున్నాం సారూ! ఇక్కడ పాల బిజినెస్ బాగుంటదండి. మా అప్పిగాడికి సదువబ్బడం లేదండి. బడి కెళ్లడంలేదు. ఇల్లిల్లూ తిరిగి పాలపేకెట్లెయ్యడానికి పనికొత్తాడు గదండీ. అదండి." అన్నది దుర్గమ్మ.

ఇంతలో వెంకటేశం సీరియస్‌గా వచ్చి "ఏంది దుర్గమ్మా! మా ఆవిడ్ని రోడ్డుమీద నిలేసి నానా మాటలు అన్నావంట. బూతులు తిట్టినా వంట." అన్నాడు.

"ఆం... తిట్టాను. ఐతే ఏంది?" అన్నది దుర్గమ్మ అంతే సీరియస్‌గా.

"ఎంత బాకీ వుంటే మాత్రం? అన్నేసి తిట్లా?"

"మరేం చెయ్యాలేం? మూణ్ణెల్ల నుంచి బాకీ తీర్చకుండా మొఖం చాటేస్తే తిట్టక ముద్దెట్టు కుంటారా? రోడ్డు మీద నిలేయకుండా నీ ఇంటి కొచ్చి బొట్టూకాటుకెట్టి బాకీ ఇయ్యమని అడిగితే ఇస్తారా?"

దుర్గమ్మ తొణక్కుండా చెట్టంత మగాడిని పట్టుకుని చెడామడా దులిపేస్తోంది.

"సరే! సరే తీసుకో." అని వెంకటేశం డబ్బిచ్చి వెళ్లిపోయాడు.

"వీడు బాగానే సంపాదిత్తాడు సారూ! డబ్బు ల్లేక కాదు, తాగుడు అలవాటు వెధవకి. దానికే తగలేత్తాడు. తిడితేగాని ఇటువంటోల్ల దగ్గర డబ్బురాలదు." అని నవ్వింది దుర్గమ్మ.

దుర్గమ్మ అవగాహన మెచ్చుకోదగిందే అనుకున్నాడు కిరణ్‌కుమార్.

"సారూ! మాకు లోను ఎప్పుడిప్పిత్తారు?" అడిగింది దుర్గమ్మ.

"నీకు లోను ఎందుకుగాని మా బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తాను." నవ్వుతూ అన్నాడు.

"పరాచకాలా సారూ! నాకెందుకిస్తారు ఉద్యోగం? నాకు చదువా చట్టుబండలా? ఇచ్చి నా ఊడ్చేదో, కడిగేదో ఇస్తారు! నేనీవయసులో ఆ పనులేం చేస్తాను? వల్లు పెరిగి పోయిం దిగా?" అన్నది దుర్గమ్మ నవ్వుతూ.

"అబ్బే! నీకు అటువంటి ఉద్యోగం ఏం ఖర్మ? రికవరీ ఏజెంట్ ఉద్యోగం ఇస్తాం?"

"అదేంది సారూ?"

"మా బ్యాంక్‌లో లోన్ తీసుకుని డబ్బు కట్ట

కుండా మొండి వాళ్లుంటారు. వాళ్ల దగ్గర బాకీలు వసూలు చేయాలి. ఇందాక ఆ అమ్మాయిని పట్టుకుని దులిపావు చూడు... ఆ మాదిరన్న మాట.”

“అంటే ఏంది సారూ! వాళ్ల ఇళ్లకెళ్లి బూతులు తిట్టి బాకీ వసూలు చెయ్యాలన్న మాట.”


“అంతే... అంతే. ఇళ్లకెళ్లి గొడవ చెయ్యాలి. వాళ్ల పరువుతియ్యాలి. అమ్మో! దుర్గమ్మొస్తుందేమోనని భయపడి చావాలి. పరిగెత్తుకొచ్చి లోన్ కట్టేస్తారు. అందుకు నీకు జీతం ఇస్తాం.” చెప్పాడు కిరణ్‌కుమార్.

“ఐతే నేను రెడీ సారూ!” అన్నది దుర్గమ్మ సంతోషపడిపోతూ.

“నీకు ఉద్యోగం వచ్చినట్లే. రెండు పాస్‌పోర్టు ఫోటోలు తీసుకుని మా బ్యాంక్‌కి వచ్చెయ్. రేపే జాయినైపోదువుగాని డ్యూటీలో.” అన్నాడు కిరణ్‌కుమార్.

“సారూ! మావూళ్లో మా అక్కవుంది. నా కంటే రెండేళ్లు పెద్దది. ఊళ్లో వ్యవసాయం వుంది. కానీ పంటలు పండితే రేటురాక, పండక పోతే ఖర్చులకు సాలక నానా బాధలూ పడుతోంది. దాని క్కూడా మీ బ్యాంక్‌లో వుద్యోగం ఇప్పియ్యండి సారూ! అది నాకంటే పెద్ద పెద్ద బూతులు తిడుతుంది సారూ!”అన్నది దుర్గమ్మ.

కిరణ్‌కుమార్‌కి నవ్వువస్తూంటే ఆపుకుని, “సరే! సరే! ముందు నువ్వు చేరిపో. మీ అక్క సంగతి తర్వాత చూద్దాం.” అన్నాడు స్కూటర్ స్టార్ట్ చేస్తూ. ●



విజయవాడలో మానస సాహిత్య అకాడమి జాతీయస్థాయి సాహిత్య పురస్కారాన్ని యువకవి ఎన్.వి. రఘువీర్‌ప్రతాప్‌కి అందజేస్తున్న కవి కె. శివారెడ్డి.